
సాక్షి
ఖమ్మం
ఆదివారం । 29 । అక్టోబర్ । 2023



పేదలకు 'పెద్ద' వైద్యం

జిల్లా ప్రభుత్వాస్పత్రిలోని క్యాథలాబ్ ద్వారా గుండె సంబంధిత వైద్యసేవలు పేదలకు ఉచితంగా, మెరుగ్గా అందుతున్నాయి. 12లో



చిన్నబోయిన సుజాతనగర్!

ఒకప్పుడు ఉమ్మడి జిల్లాలోనే పెద్దదైన సుజాతనగర్ నియోజకవర్గం ఇప్పుడు రద్దు కాగా, గ్రామపంచాయతీగా మిగిలింది. 10లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం
33° / 22°

ఆదివారం ఉదయం, సాయంత్రం చలి పెరిగే అవకాశముంది. మధ్యాహ్నం మాత్రం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదువుతాయి.

న్యూస్‌రీల్

జమలాపురం ఆలయ ద్వారబంధనం



ఆలయ ద్వారబంధనం చేస్తున్న అర్చకులు

ఎర్రుపాలెం: చంద్రగ్రహణం సందర్భంగా జమలాపురంలోని శ్రీవేంకటేశ్వరస్వామి వారి ఆలయాన్ని శనివారం మధ్యాహ్నం అర్చకులు, అధికారులు ద్వారబంధనం చేశారు. శనివారం ఉదయం ఆలయ శుద్ధి, దేవతామూర్తులకు అభిషేకాలు, సంప్రోక్షణ చేస్తామని వెల్లడించారు. ఆతర్వాత భక్తులను దర్శనానికి అనుమతిస్తామని తెలిపారు. ఆలయ సూపరింటెంట్ విజయకుమారి, ముఖ్య అర్చకులు ఉప్పల విజయదేవ శర్మ తదితరులు పాల్గొన్నారు.

148 కేసులు... రూ.3.42 కోట్ల సీజ్

ఖమ్మం సహకారనగర్: ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నాటి నుంచి జిల్లాలో సరైన పత్రాలు లేకుండా తీసుకెళ్తున్న రూ.3,42,71,377 నగదు సీజ్ చేసినట్లు కలెక్టర్ వీ.పీ.గౌతమ్ తెలిపారు. ఇందుకు సంబంధించి 148 కేసులు నమోదు చేశామన్నారు. అయితే, ఇందులో 138 కేసులకు సంబంధించి ఆధారాలు సమర్పించడంతో రూ.2,57,99,215 విడుదల చేశామని చేశారు. అలాగే, సామగ్రి, తదితరాలకు సంబంధించి నాలుగు కేసులు నమోదు చేసి రూ.87,99,676 విలువైన సామగ్రిని స్వాధీనం చేసుకోగా, రెండు కేసులు పరిష్కారమయ్యాయని కలెక్టర్ ఓ ప్రకటనలో వెల్లడించారు.

సమర్థవంతంగా విధులు నిర్వర్తించండి

ఖమ్మం సహకారనగర్: శాసనసభ ఎన్నికల్లో ఉద్యోగులు సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని ఎన్నికల సంఘం అధికారులు సూచించారు. ఢిల్లీ నుండి శనివారం రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పలు సూచనలు చేశారు. జిల్లా నుంచి కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి, అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్ తదితరులు పాల్గొనగా.. ఎన్నికల సంఘం అధికారులు మాట్లాడుతూ మార్గదర్శకాలకు లోబడి విధులు నిర్వర్తించేలా అగాహన పెంచుకోవాలని తెలిపారు. జాతీయ స్థాయి శిక్షకులు సయ్యద్ నసీర్ జమీల్ నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, గుర్తుల కేటాయింపు, అనుమతుల మంజూరు, పోలింగ్ రోజు ఏర్పాట్లపై అధికారులకు అవగాహన కల్పించారు. వీసీలో అసిస్టెంట్ కలెక్టర్ మయాంక్ సింగ్, ఆర్డీఓలు జి.గణేష్, అశోక్ చక్రవర్తి, ఎస్‌డీసీ రాజేశ్వరి, కలెక్టరేట్ ఏఓ అరుణ, ఎన్నికల విభాగం సూపరింటిండెంట్ రాంబాబు, ఈడీఎం దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నవోదయలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కూసుమంచి: పాలేరులోని జవహర్ నవోదయ విద్యాలయలో 2024–25 విద్యా సంవత్సరానికి గాను 9, 11వ తరగతుల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె.శ్రీనివాసులు తెలిపారు. ప్రస్తుతం 8, 10వ తరగతి చదువుతున్న వారు అర్హులన్నారు. ఆసక్తి ఉన్న వారు ఆన్‌లైన్‌లో ఈనెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. విద్యార్థులకు వచ్చే ఏడాది ఫిబ్రవరి 10వ ప్రవేశపరీక్ష నిర్వహిస్తామని ప్రిన్సిపాల్ తెలిపారు.

బాణసంచా దుకాణాల అనుమతికి దరఖాస్తులు

ఖమ్మంక్రైం: దీపావళి పర్వదినం సందర్భంగా జిల్లాలో బాణసంచా దుకాణాలు ఏర్పాటుచేయాలనుకునే వ్యాపారులు నవంబర్ 5వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ఖమ్మం పోలీస్ కమిషనర్ విష్ణు ఎస్.వారియర్ సూచించారు. పోలీస్, కేఎంసీ, అగ్నిమాపక శాఖ అధికారులు నిర్దేశించిన ప్రదేశాల్లో మాత్రమే దుకాణాలు ఏర్పాటుచేయాల్సి ఉంటుందని తెలిపారు. దరఖాస్తుతో పాటు ఏఈ–5 ఫామ్, సెల్ఫ్ అఫిడవిట్, చలానా రశీదు, ఆధార్ కార్డ్, ఫొటో జతపర్చాలన్నారు. అనుమతి లేకుండా బాణసంచా నిల్వ చేసినా, అమ్మినా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని సీపీ హెచ్చరించారు.

షూటింగ్ పోటీల్లో ప్రతిభ

ఖమ్మం స్పోర్ట్స్: దక్షిణ కొరియాలో జరుగుతున్న అంతర్జాతీయ స్థాయి షూటింగ్ పోటీల్లో భారత జట్టు తరఫున ఖమ్మంకు చెందిన సాధుల మేఘన బృందం పాల్గొంటోంది. ఈనెల 21న మొదలైన పోటీల్లో భారత జట్టులో తెలంగాణ నుంచి సాధుల మేఘన, హర్యానా నుంచి సిమ్రాన్, పంజాబ్‌కు చెందిన తేజస్విని ఉండగా 25 మీటర్ల పిస్టల్ ఈవెంట్‌లో రజత పతకం గెలుచుకున్నారు. ఖమ్మం ట్రాఫిక్ ఏసీపీ సాదుల సారంగపాణి కుమార్తె అయిన మేఘనను ఎంపీ వద్దిరాజు రవిచంద్ర తదితరులు అభినందించారు.

INTERVIEW

మేం సిద్ధమయ్యాం..



కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గౌతమ్

సాక్షిప్రతినిధి, ఖమ్మం: 'జిల్లాలో ఎన్నికల ప్రక్రియకు సంబంధించి ఒక్కో కార్యక్రమం పూర్తి కావస్తోంది. ఇప్పటికే స్ట్రాంగ్‌రూమ్‌లకు ఈవీఎంలు చేరాయి. పోలింగ్‌కు సంబంధించి 1,455 కేంద్రాల్లో అవసరమైన 6,900 మంది ఉద్యోగులకు ఉత్తర్వులు అందజేశాం. ఈనెల 30 నుంచి మూడు రోజుల పాటు తొలి విడత శిక్షణ ఉంటుంది. జర్నలిస్టులకు కూడా ఈసారి పోస్టల్ బ్యాలెట్ ఇచ్చారు. కొత్త కోడళ్ల ఓటింగ్ శాతం పెరిగేలా ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నాం. జిల్లావ్యాప్తంగా అన్ని పోలింగ్ కేంద్రాల్లో తొలిసారి వెబ్‌కాస్టింగ్ చేపడుతున్నాం..' అని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వీ.పీ.గౌతమ్ వెల్లడించారు. ఎన్నికల ఏర్పాట్లకు సంబంధించి 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించిన వివరాలు ఆయన మాటల్లోనే..

- పోలింగ్ విధులకు 6,900 మంది
- ఈనెల 30వతేదీ నుంచి మూడు రోజుల పాటు శిక్షణ
- అన్ని పోలింగ్ స్టేషన్లలో తొలిసారి వెబ్‌కాస్టింగ్
- జర్నలిస్టులకూ ఈసారి పోస్టల్ బ్యాలెట్
- జిల్లాలో 15వేల మంది కొత్త కోడళ్ల గుర్తింపు
- కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వీ.పీ.గౌతమ్

1,750 మంది పీఓలు..

జిల్లాలోని 1,455 పోలింగ్ స్టేషన్లలో 6,900మంది ఉద్యోగులు విధుల్లో పాల్గొంటారు. ఇందులో 1,750 మంది పీఓలు, 1,750 మంది ఏపీఓలు, అలాగే 3,400 మంది ఓపీఓలు ఉంటారు. 20 శాతం ఉద్యోగులను రిజర్వ్‌గా గుర్తించాం. ప్రస్తుతం వీరు ఏ నియోజకవర్గ పరిధిలో పనిచేస్తున్నారో ఆ నియోజకవర్గ కేంద్రంలోనే తొలి విడత శిక్షణ ఉంటుంది. నవంబర్ 15న రెండో విడత ర్యాండమైజేషన్ తర్వాత విధుల్లో పాల్గొనాల్సిన నియోజకవర్గంలో జరిగే రెండో విడత శిక్షణకు హాజరుకావాలి. ఖమ్మంలోని ఎస్‌ఆర్‌అండ్‌బీజీఎన్‌ఆర్, వైరాలో ప్రభుత్వ పాఠశాల, సత్తుపల్లిలో జేవీఆర్ డిగ్రీ కాలేజీ, మధిరలో టీవీఎం హైస్కూల్, పాలేరు నియోజకవర్గానికి ఖమ్మం గాంధీచౌక్‌లోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శిక్షణ ఇవ్వనున్నాం.

పోస్టల్ బ్యాలెట్‌కు ఫామ్–12 డీ

వచ్చేనెల 3న నోటిఫికేషన్ వెలువడినప్పటి రోజు నుంచి నామినేషన్లు స్వీకరిస్తాం. ఈవీఎంల కమిషనింగ్, దరఖాస్తుల పరిశీలన, విత్‌డ్రా, అభ్యర్థుల తుది జాబితా, పోస్టల్ బ్యాలెట్ ప్రింటింగ్ తదితర పనులు వరుసగా ఉంటాయి. పోలింగ్ రోజు న్యూస్ కవరేజీ విధుల్లో అక్రిడిటేటెడ్ జర్నలిస్టులే కాక అక్రిడిటేషన్ ఉన్న జర్నలిస్టులంతా పోస్టల్ బ్యాలెట్ ఉపయోగించుకోవచ్చు. మెడికల్ అండ్ హెల్త్, టీఎస్ ఆర్టీసీ, రైల్వేస్, ఎయిర్‌వేస్, విద్యుత్ వంటి అత్యవసర శాఖలకు సంబంధించి విధుల్లో ఉండే వారంతా పోస్టల్ బ్యాలెట్‌కు అర్హులు. వీరందరూ ఫామ్–12డీ కింద దరఖాస్తు చేసుకోవాలి. ప్రతీ నియోజకవర్గంలోని ఆర్‌ఓ కార్యాలయంలో ఏర్పాటుచేసే బాక్సుల్లో వచ్చేనెల 25 నుంచి 28 లోపు పోస్టల్ బ్యాలెట్ వేయాలి.

వెబ్‌కాస్టింగ్‌కు త్వరలోనే అనుమతి

ఈసారి జిల్లాలోని 1,455 పోలింగ్ స్టేషన్లలో వెబ్‌కాస్టింగ్ కోసం ఎన్నికల కమిషన్‌కు ప్రతిపాదనలు పంపాం. ఇప్పటివరకు 50 శాతం కేంద్రాలకు అనుమతి వచ్చింది. మిగతా వాటికీ వస్తుంది. తద్వారా పోలింగ్ కేంద్రంతో పాటు ప్రహరీ ఆవల, చుట్టుపక్కల ఏం జరుగుతుందో తెలుసుకోవచ్చు. జిల్లాలోని అన్ని పోలింగ్ స్టేషన్లలో వెబ్‌కాస్టింగ్ ఇదే తొలిసారి. గత ఎన్నికల్లో 350 సమస్యాత్మక కేంద్రాల్లోనే ఏర్పాటుచేశారు. వెబ్‌కాస్టింగ్ పర్యవేక్షణకు కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటుచేసి, విధులు నిర్వర్తించే వంద మందికి శిక్షణ ఇప్పిస్తున్నాం.

ఐదు కేంద్రాల్లో స్ట్రాంగ్‌రూమ్‌లు

సత్తుపల్లిలోని జ్యోతినిలయం, మధిరలో ప్రభుత్వ పాలిటెక్నిక్, పాలేరు నియోజకవర్గానికి శ్రీచైతన్య ఇంజనీరింగ్ కాలేజ్, ఖమ్మంలో సెయింట్ జోసఫ్ స్కూల్, వైరాలో సోషల్ వెల్ఫేర్ గురుకులంలో స్ట్రాంగ్‌రూమ్‌లు ఏర్పాటు చేశాం. ఈవీఎంలను అక్కడకు తరలించి భద్రపరిచాం. ఈ కేంద్రాల్లోనే వచ్చే వచ్చేనెల 29న ఎన్నికల సిబ్బందికి ఈవీఎంలు అందజేస్తాం.

కొత్త కోడళ్లకు ఓటు హక్కు

ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 30వరకు గడువు ఉంది. వచ్చేనెల 11న వెలువరించే తుది ఓటర్ల జాబితాతో ఎన్నికలకు వెళ్తాం. గత ఐదేళ్లలో జిల్లాకు కోడళ్లుగా వచ్చిన వారు 15వేల మంది ఉన్నట్లు గుర్తించాం. వీరికి పుట్టింటి దగ్గర ఓటు ఉన్నా అక్కడకు వెళ్లి వేయలేని పరిస్థితి ఎదురవుతుంది. అందుకే అందరూ మెట్టినింటికి ఓటు హక్కు మార్చుకునేలా స్పెషల్ డ్రైవ్ చేపట్టాం. పుట్టింటి, అత్తింటి చిరునామాలు సేకరించి ఎక్కడ ఓటు ఉంది, ఎవరెవరికి అసలే లేదని పరిశీలించాం. రెండు వేల పైచిలుకు మంది ఓటు హక్కు లేని వారు ఉండగా, దరఖాస్తుకు సూచనలు చేశాం.

సీ-విజిల్ ఫిర్యాదులు గోప్యం

ప్రజలే కాక పార్టీల నాయకులు సీ విజిల్ యాప్ డౌన్‌లోడ్ చేసుకునేలా అవగాహన కల్పించాం. ఈ యాప్‌లో ఫిర్యాదు చేసే వారి వివరాలు, ఫోన్ నంబర్లు కూడా గోప్యంగా ఉంచుతాం. ఓటు కొనడానికి డబ్బు, మద్యం, బహుమతులు ఇచ్చే వారి ఫొటో, వీడియో తీసి ఫిర్యాదు చేయొచ్చు. ఫిర్యాదు అందిన ముప్పై నిమిషాల్లో అక్కడకు సంబంధిత టీమ్ చేరుకుంటుంది.



ఒక్క ఇరిగేషన్ ప్రాజెక్టూ తీసుకురాలేదు..



మాట్లాడుతున్న మంత్రి పువ్వాడ అజయ్, పక్కన ఎంపీలు నామ, వద్దిరాజు, ఎమ్మెల్సీ తాతా మధు

- స్వార్థం కోసం సొంత పార్టీ ఎమ్మెల్యేలను ఓడగొట్టావు
- కేసీఆర్ చేరదీయకుంటే రాజకీయ జీవితం ముగిసేది
- తుమ్మలపై మంత్రి పువ్వాడ అజయ్ ఫైర్

సాక్షిప్రతినిధి, ఖమ్మం: మంత్రిగా వ్యవహరించిన సమయంలో తుమ్మల నాగేశ్వరరావు ఖమ్మం జిల్లాకు ఒక్క ఇరిగేషన్ ప్రాజెక్టు కూడా తీసుకురాలేదని, జిల్లాకు ఆయన చేసింది శూన్యమని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. ఖమ్మంలోని బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఎన్నికల్లో ఇద్దరు నాయకులు చెప్పిన వారికే టికెట్లు ఇచ్చినా పార్టీని నట్టేట ముంచారని విమర్శించారు. తుమ్మల రాజకీయ జీవితం అందరికీ తెలుసని, పలువురి రాజకీయ జీవితాన్ని నాశనం చేశారని తెలిపారు. ఈ లెక్కలన్నీ ప్రజలు, ఆయన వల్ల నష్టపోయిన వారికి తెలుసని చెప్పారు. స్వార్థంతో సొంత పార్టీ ఎమ్మెల్యేలను ఓడించి పదవులను అనుభవించారని ఆరోపించారు. మొదట టీడీపీ, ఆ తర్వాత బీఆర్‌ఎస్, ఇప్పుడు కాంగ్రెస్‌లో ఉన్న తుమ్మల నిబద్ధత ఏమిటో అర్థమవుతోందన్నారు. పదవులపై ఉన్న ధ్యాస ప్రజలకు మంచి చేద్దామనే విషయంలో లేదని.. పదవులే అవసరం లేకపోతే కాంగ్రెస్‌లో ఎందుకు చేరారో చెప్పాలని సూచించారు. ఇప్పటికైనా అహంకారం తగ్గించుకోవాలని, కేసీఆర్ మీద అవాకులు చెవాకులు పేలితే ప్రజలు ఇంటికి పంపిస్తారని హెచ్చరించారు. తొమ్మిదేళ్ల క్రితం ముఖ్యమంత్రి కేసీఆర్ ఆయనకు మంత్రి పదవి ఇవ్వకుంటే రాజకీయ జీవితం ముగిసిపోయి ఉండేదని అన్నారు. ఇక తాను ఎక్కడా భూములు కబ్జా చేయలేదని, అధికారిక జీఓ 59 ద్వారా చట్టప్రకారం డబ్బు కట్టి రోడ్డు స్థలాన్ని కొనుక్కున్నానని పువ్వాడ వెల్లడించారు. ఎంపీలు నామ నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పొంగులేటి శ్రీనివాస రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు పార్టీలో చేరారన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోకుండా పార్టీకి వెన్నుపోటు పొడిచారని విమర్శించారు.

ప్రణాళికాయుతంగా సభకు ఏర్పాట్లు

ఖమ్మంమయూరిసెంటర్: పాలేరు నియోజకవర్గ సభ విజయవంతమైన నేపథ్యాన, ఇదే ఉత్సాహంతో ఖమ్మం నియోజకవర్గ సభపై దృష్టి సారించాలని రాష్ట్ర మంత్రి, బీఆర్‌ఎస్ ఖమ్మం అభ్యర్థి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. ఖమ్మంలోని బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో నియోజకవర్గ నాయకులతో సమావేశమైన ఆయన మాట్లాడుతూ ఈనెల 5న ఖమ్మం ఎస్‌ఆర్‌అండ్‌బీజీఎన్‌ఆర్ కళాశాల మైదానంలో జరిగే ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్ పాల్గొంటారని తెలిపారు. ప్రజలు పెద్దసంఖ్యలో హాజరయ్యేలా నాయకులు కృషి చేయాలని తెలిపారు. ఖమ్మం సభ విజయవంతానికి ఖమ్మం ఎంపీ నామ నాగేశ్వరరావు ఇన్‌చార్జిగా వ్యవహరిస్తారని పేర్కొన్నారు. రెండో విడత ప్రజా ఆశీర్వాద సభలు వైరా, మధిరలో జరిగే అవకాశం ఉందని మంత్రి తెలిపారు. ఈ సమావేశాల్లో ఎమ్మెల్సీ, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధు, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు, పాలేరు, మధిర, వైరా ఎమ్మెల్యే అభ్యర్థులు కందాల ఉపేందర్‌రెడ్డి, లింగాల కమల్‌రాజ్, బానోత్ మదన్‌లాల్, డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, మేయర్ పి.నీరజ, నాయకుడు గుండాల కృష్ణ పాల్గొన్నారు.

పదికి పది గెలిచి తీరుతాం



మాట్లాడుతున్న మాజీ ఎంపీ శ్రీనివాసరెడ్డి, పక్కన నాయికులు

- కందాల కాదు పాలేరులో మీరు నిలబడండి
- పాలేరు సభలో నా పేరు ప్రస్తావిస్తే తెలిసేది
- కేసీఆర్‌పై మాజీ ఎంపీ పొంగులేటి వ్యాఖ్యలు

సాక్షిప్రతినిధి, ఖమ్మం: ఎన్నికల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పది స్థానాలను కాంగ్రెస్ గెలుస్తుందని మాజీ ఎంపీ, కాంగ్రెస్ ప్రచార కమిటీ కోచైర్మన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఖమ్మంలోని డీసీసీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సీఎం కేసీఆర్ పాలేరు సభలో తన పేరు ప్రస్తావించకుండా విమర్శలు చేశారని, పేరు ప్రస్తావించి ఉంటే తన సత్తా ఏమిటో ఆ సభలోనే తెలిసి ఉండేదన్నారు. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేలా డబ్బు, మదం అనే పదాలను వాడారని, అసలు ప్రజాస్వామ్యం అనే పదానికి కేసీఆర్‌కు అర్థం తెలియదన్నారు. ఆయన పక్కన కూర్చున్న వారంతా ఏ పార్టీలో గెలిచారో తెలియకుండా మాట్లాడారని ఎద్దేవా చేశారు. కాంట్రాక్టులు, పైరవీలు చేసి డబ్బు సంపాదించామని చెప్పారని, తడిబట్టలతో ఎక్కడికి రమ్మంటే అక్కడికి వస్తా.. భగవంతుడు శిక్ష ఎవరికి వేస్తాడో చూద్దామని సవాల్ విసిరారు. హుజూరాబాద్‌లో ఈటల రాజేందర్‌ను ఓడించేందుకు దళితబంధు ప్రవేశపెట్టి, ఇప్పుడు సత్తుపల్లి, పాలేరులోనూ అమలు చేస్తామంటూ దళితులను మభ్య పెడుతున్నారని విమర్శించారు. వ్యవసాయం, కాంట్రాక్టులు చేసి తాను సంపాదించానని, అఫిడవిట్‌లో తన ఆస్తులన్నీ చూపిస్తున్నానని, అదేమాదిరి చూపించగలరా అని కేసీఆర్‌నుద్దేశించి ప్రశ్నించారు. సోనియాగాంధీ ఇవ్వకపోతే తెలంగాణ సాధ్యం కాకపోయేదని అసెంబ్లీలోనే కేసీఆరే అన్నారని పొంగులేటి తెలిపారు. కాగా, పాలేరులో ఉపేందర్‌రెడ్డి కాదని ముఖ్యమంత్రి కేసీఆర్ వచ్చి పోటీ చేయాలని సవాల్ చేశారు. 2018లో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఓటమికి విశ్లేషణ కూడా చేయలేదన్నారు. ఏదిఏమైనా రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి 80 నుంచి 82 స్థానాలు వస్తాయని, ఈ సంఖ్య ఇంకా పెరగొచ్చని పొంగులేటి చెప్పారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, వైరా మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, నాయకులు రాయల నాగేశ్వరరావు, జావేద్, విజయాబాయి, మద్దినేని స్వర్ణకుమారి, నిరంజన్‌రెడ్డి, పుచ్చకాయల వీరభద్రం, రామదాం నాయక్, సౌజన్య, పగడాల మంజుల, చోటాబాబా, సయ్యద్ ముజాహిద్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బంది రానివ్వొద్దు

- ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ముందస్తుగా ఏర్పాట్లు
- అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మధుసూదన్, పక్కన డీఎస్‌ఓ శ్రీలత

ఖమ్మం సహకారనగర్: జిల్లా రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా ధాన్యం సేకరణ పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్ సూచించారు. కలెక్టరేట్‌లో శనివారం ధాన్యం కొనుగోలు ప్రక్రియపై సివిల్ సప్లయీస్, డీఆర్డీఓ, సహకారశాఖ, వ్యవసాయ శాఖ అధికారులతో పాటు రైస్ మిల్లర్లతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 230 ధాన్యం సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేయనుండగా, రైతులు మద్దతు ధర పొందేందుకు శుభ్రంగా తీసుకొచ్చేలా అవగాహన కల్పించాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రద్దీ నియంత్రణకు రైతులకు టోకెన్లు జారీ చేయాలని తెలిపారు. అలాగే, గన్నీ బ్యాగులు, టార్పాలిన్లు, తూకం, తేమ పరీక్ష యంత్రాలు ముందుగానే సమకూర్చుకోవాలని, కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఏ రోజుకా రోజు ఆన్‌లైన్‌లో నమోదు చేసి మిల్లులకు తరలించాలని చెప్పారు. జిల్లా పౌరసరఫరాల అధికారి శ్రీలత, డీఏఓ విజయనిర్మల, డీసీఓ విజయకుమారి, రైస్ మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షుడు బొమ్మ రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించాలి

ప్రింటింగ్ ప్రెస్‌లు, కేబుల్ టీవీ యజమానులు ఎన్నికల నియమావళికి అనుగుణంగా వ్యవహరించాలని జిల్లా అదనపు ఎన్నికల అధికారి, అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్ సూచించారు. కలెక్టరేట్‌లో శనివారం ఆయన ప్రింటింగ్ ప్రెస్, కేబుల్ టీవీ నిర్వాహకులతో సమావేశమయ్యారు. మార్గదర్శకాలకు లోబడి అనుమతి తీసుకున్నాకే పార్టీ నాయకుల ప్రచార సామాగ్రి ముద్రించాలని, తొలుత ఇద్దరు వ్యక్తుల ధృవీకరణ తీసుకోవాలని తెలిపారు. ప్రింటింగ్, పబ్లిషర్ పేరు లేకుండా ఎన్నికల అంశాలతో ముడిపడిన పోస్టర్లు, కరపత్రాలు ముద్రిస్తే చర్యలు తీసుకుంటామని చెప్పారు. అలాగే, కేబుల్ టీవీలోనూ ప్రసారానికి ముందస్తు అనుమతి తీసుకోవాలని సూచించారు. ఎన్నికల వ్యయ పర్యవేక్షణ నోడల్ అధికారి విజయకుమారి, డీపీఆర్వో ఎం.ఏ.గౌస్, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ రాంబాబు, ఏపీఆర్వో వల్లోజి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

శబరికి స్మృత్యంజలి



స్వామి వారికి ఫల, పుష్పాలు సమర్పిస్తున్న అర్చకులు

- అపర భక్తురాలికి ఫల, పుష్పాలతో ప్రత్యేక పూజలు
- గిరిజన సంప్రదాయ నృత్యాలతో మురిసిన భద్రగిరి
- దేవస్థానం ఆధ్వర్యంలో గిరిజనులకు సత్కారం

భద్రాచలం: భద్రాద్రి రామయ్యకు అపర భక్తురాలిగా పేరుగాంచిన శబరికి ఘనంగా స్మృత్యంజలి ఘటించారు. పరమ భక్తితో రామయ్యకు ఎంగిలి పండ్లను సమర్పించి ఆయనను మెప్పించిన శబరికి గిరిజనుల సమక్షాన శనివారం వైభవంగా ఉత్సవం నిర్వహించారు. భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానంలో ఏటా అశ్వయుజ పౌర్ణమి రోజున శబరి స్మృతి యాత్ర నిర్వహించడం ఆనవాయితీ. 2013లో ప్రారంభమైన ఈ ఉత్సవాన్ని కొనసాగిస్తూ అధికారులు ప్రత్యేకంగా బస్సులు ఏర్పాటు చేసి గిరిజనులను, కుల పెద్దలను భద్రాచలం తీసుకొచ్చారు.

శబరికి ఘన ఫల, పుష్పాంజలి

శబరి చిత్రపటంతో మేళతాళాలు, భక్తుల శ్రీరామ నామస్మరణల నడుమ ఊరేగింపుగా గిరి ప్రదక్షిణ చేశారు. చప్టా దిగువన ఉన్న తూము నరసింహ దాసు, భక్త రామదాసు విగ్రహాలకు ఆలయ ఈఓ ఎల్.రమాదేవి పూలమాలలు వేయగా, అర్చకులు హారతి ఇచ్చారు. శబరి విగ్రహానికి కూడా పూలు, పండ్లు, వస్త్రాలు సమర్పించారు. గిరిజనుల వేషధారణలు, కొమ్ము నృత్యాలతో చేసిన ఊరేగింపు అందరినీ ఆకట్టుకుంది. అనంతరం బేడా మండపంలో కొలువైన స్వామి వార్లకు, శబరికి గిరిజనులు పండ్లు, పూలు సమర్పించగా, అర్చకులు పుష్పాంజలి నిర్వహించారు. అనంతరం స్వామి నిత్యకల్యాణోత్సవాన్ని జరిపించగా గిరిజనులు కనులారా వీక్షించారు. ఆలయ ఏఈఓ భవానీ రామకృష్ణ, గిరిజన కుల పెద్దలు ముర్ల రమేష్, పూనెం కృష్ణ, తెల్లం వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు. కాగా, ఏపీలోని వరరామచంద్రాపురం సమీపాన శబరి నది వద్ద కూడా భద్రాద్రి రామాలయ అర్చకులు పూజలు చేశారు. అక్కడి శబరి విగ్రహానికి నదీ జలంతో అభిషేకం చేయడంతో పాటు వస్త్రాలతో అలంకరించి హారతి, నైవేద్యం సమర్పించారు.



శబరి విగ్రహం వద్ద పూజలో ఈఓ రమాదేవి, తదితరులు

చిన్నబోయిన సుజాతనగర్‌ !

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఒకప్పుడు పెద్ద నియోజకవర్గంగా వెలిగిన సుజాతనగర్‌ నియోజకవర్గం రాజకీయ చిత్రపటం నుంచి పూర్తిగా కనుమరుగైంది. నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా 1978లో ఈ నియోజకవర్గం ఏర్పాటు కాగా.. 2009లో చేపట్టిన పునర్విభజనలో తెరమరుగైంది. నియోజకవర్గంగా ఉన్నప్పుడు ఏన్కూరు, జూలూరుపాడు, కామేపల్లి మండలాలు పూర్తిగా, ఖమ్మం అర్బన్, ఖమ్మం రూరల్, కొణిజర్ల, కారేపల్లి, కొత్తగూడెం, టేకులపల్లి, గార్ల మండలాలు పాక్షికంగా ఉండేవి. ఇక్కడ మొత్తం ఎనిమిది పర్యాయాలు ఎన్నికలు(ఒక ఉప ఎన్నిక కలిపి) జరగగా నాలుగేసి సార్లు సీపీఐ, కాంగ్రెస్‌ విజయకేతనం ఎగరవేశాయి. – సుజాతనగర్‌


సుజాతనగర్‌ వ్యూ

ఇక్కడి గతం.. ఆసక్తికరం

- 2009లో నియోజకవర్గం కనుమరుగు
- ఎనిమిది సార్లు ఎన్నికల్లో ముగ్గురే విజేతలు
- నేడు సాధారణ గ్రామ పంచాయతీగా మనుగడ

సీపీఐ వరుస విజయాలు

సుజాతనగర్‌ నియోజకవర్గంలో సీపీఐ అభ్యర్థి మహమ్మద్‌ రజబ్‌ అలీ వరుసగా నాలుగు సార్లు విజయం సాధించారు. ఆయన మరణానంతరం జరిగిన ఉప ఎన్నికలో కాంగ్రెస్‌ అభ్యర్థి రాంరెడ్డి వెంకటరెడ్డి విజయం సాధించారు. ఆ తర్వాత మరో రెండుసార్లు ఆయన విజయం సాధించడం విశేషం. ముప్పై ఏళ్ల పాలన క్రమంలో కేవలం ముగ్గురు అభ్యర్థులే ఇక్కడ నుంచి ప్రాతినిధ్యం వహించారు. 2009లో చేపట్టిన పునర్విభజనలో ఈ నియోజకవర్గంలోని ఏన్కూరు, కొణిజర్ల, జూలూరుపాడు, కారేపల్లి మండలాలతో పాటు, మధిర నియోజకవర్గంలో కొనసాగిన వైరా మండలాన్ని కలిపి కొత్తగా వైరా నియోజకవర్గం ఆవిర్భవించింది. దీంతో 30 ఏళ్లపాటు నియోజకవర్గంగా కొనసాగిన సుజాతనగర్‌ గ్రామపంచాయతీ కేంద్రంగా మిగిలిపోయింది. ఇక కొత్త జిల్లాల ఏర్పాటులో భద్రాద్రి కొత్తగూడెంలో కలిసింది. ఇప్పుడు మండల కేంద్రంగా కొనసాగుతుండగా... నాటి గురుతులు నేటికీ సజీవ సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి.

సుజాతనగర్‌ నియోజకవర్గ ఎమ్మెల్యేలు వీరే

సంవత్సరం	విజేత	పార్టీ
1978	బొగ్గారపు సీతారామయ్య	కాంగ్రెస్‌ (ఐ)
1983	ఎండీ రజబ్‌ అలీ	సీపీఐ
1985	ఎండీ రజబ్‌ అలీ	సీపీఐ
1989	ఎండీ రజబ్‌ అలీ	సీపీఐ
1994	ఎండీ రజబ్‌ అలీ	సీపీఐ
1996	రాంరెడ్డి వెంకటరెడ్డి	కాంగ్రెస్‌
1999	రాంరెడ్డి వెంకటరెడ్డి	కాంగ్రెస్‌
2004	రాంరెడ్డి వెంకటరెడ్డి	కాంగ్రెస్‌

తొలి ఎమ్మెల్యే సీతారామయ్య

1978లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో సుజాతనగర్‌ తొలి ఎమ్మెల్యేగా బొగ్గారపు సీతారామయ్య కాంగ్రెస్‌(ఐ) నుంచి పోటీ చేసి సీపీఐ నేత పువ్వాడ నాగేశ్వరరావుపై విజయం సాధించారు. బొగ్గారపు సీతారామయ్య, పువ్వాడ నాగేశ్వరరావులు ఇరువురు కలిసి న్యాయవిద్యను అభ్యసించినా రాజకీయాల్లో మాత్రం ప్రత్యర్థులుగా పోటీచేశారు. స్వాతంత్ర్య సమరయోధుడిగా, నిజాం హైదరాబాద్‌ సంస్థానం పాలన విముక్తి కోసం జరిగిన పోరాటంలో పాల్గొన్న వ్యక్తిగా సీతారామయ్య గుర్తింపు పొందారు. ప్రముఖ న్యాయవాదిగా, శాసనసభ అంచనాల కమిటీ అధ్యక్షునిగా, ప్యానెల్‌ స్పీకర్‌గా సేవలందించారు. ఈ ఎన్నికల్లో సీపీఐ అభ్యర్థి పువ్వాడ నాగేశ్వరరావు, సీపీఎం బలపర్చిన జనతా పార్టీ అభ్యర్థి గోగినేని సత్యనారాయణ మధ్యే పోటీ ఉంటుందని అప్పట్లో అంతా భావించారు. రాజకీయ అంచనాలకు అందని విధంగా ఇందిరా కాంగ్రెస్‌ పార్టీ పక్షాన గెలిచిన సీతారామయ్య అందరినీ ఆశ్చర్యపరిచారు. హైకోర్టు న్యాయవాదిగా సైతం పనిచేసిన సీతారామయ్య కరోనాతో మృతి చెందారు.


బొగ్గారపు సీతారామయ్య (ఫైల్‌)

రాంరెడ్డి ప్రస్థానం

రజబ్‌ అలీ మరణానంతరం 1996లో జరిగిన ఉప ఎన్నికల్లో కమ్యూనిస్టుల కంచుకోటలో కాంగ్రెస్‌ పాగా వేసింది. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌ అభ్యర్థి రాంరెడ్డి వెంకటరెడ్డి విజయం సాధించారు. సీపీఎం, టీడీపీ మద్దతుతో పోటీ చేసిన రాంరెడ్డి సీపీఐ అభ్యర్థి టీ.వీ.చౌదరిని ఓడించారు. 1999 ఎన్నికల్లోనూ కాంగ్రెస్‌ హవా కొనసాగింది. టీడీపీ నుంచి పోట్ల నాగేశ్వరరావు, సీపీఐ నుంచి కూనంనేని సాంబశివరావు, కాంగ్రెస్‌ నుంచి రాంరెడ్డి వెంకటరెడ్డి బరిలో నిలవగా.. రాంరెడ్డి విజయం సాధించారు. 2004 ఎన్నికల్లో టీడీపీ నుంచి పోట్ల మాధవి, సీపీఐ నుంచి కూనంనేని సాంబశివరావు, కాంగ్రెస్‌ నుంచి రాంరెడ్డి పోటీ చేయగా.. రాంరెడ్డి మళ్లీ గెలుపొందారు. 1996, 1999, 2004లలో వరుసగా మూడుసార్లు గెలిచిన రాంరెడ్డి వెంకటరెడ్డి హ్యాట్రిక్‌ సృష్టించారు. 2009లో పునర్విభజనలో సుజాతనగర్‌ నియోజకవర్గం కనుమరుగు కావడంతో 2009, 2014లో రాంరెడ్డి వెంకటరెడ్డి పాలేరు ఎమ్మెల్యేగా విజయం సాధించారు. తద్వారా ఆయన రెండు నియోజకవర్గాల్లో కలిపి ఐదు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైనట్లయింది.


రాంరెడ్డి వెంకటరెడ్డి (ఫైల్‌)

జంగ్ తెలంగాణ

రజబ్‌ అలీది చెరగని ముద్ర

సీపీఐ నుంచి మహ్మద్‌ రజబ్‌ అలీ సుజాతనగర్‌ నియోజకవర్గం నుంచి వరుసగా మూడు సార్లు గెలిచి హ్యాట్రిక్‌ సాధించారు. తొలిసారి 1983లో కాంగ్రెస్‌(ఐ) అభ్యర్థి మహ్మద్‌ ఇస్మాయిల్‌పై గెలుపొందారు. రాష్ట్రవ్యాప్తంగా టీడీపీ విజయం సాధించినా ఆ పార్టీ అభ్యర్థి సామినేని రాఘవులుకు ఇక్కడ కేవలం 12 వేల ఓట్లే వచ్చాయి. ఆ తర్వాత 1985, 1989, 1994 అసెంబ్లీ ఎన్నికల్లో తెలుగుదేశం, సీపీఎం మద్దతుతో వరుసగా సీపీఐ అభ్యర్థి రజబ్‌ అలీ కాంగ్రెస్‌ నేత రాంరెడ్డి వెంకటరెడ్డిపై విజయం సాధించారు. ఒకమారు కాంగ్రెస్‌ అధిష్టానం చేకూరి కాశయ్యకు టిక్కెట్‌ ఇవ్వగా...రాంరెడ్డి వెంకటరెడ్డి స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసి స్వల్ప తేడాతో ఓటమి పాలయ్యారు. ఆ ఎన్నికల్లో చేకూరికి కేవలం 10 వేల ఓట్లే వచ్చాయి.


రజబ్‌ అలీ (ఫైల్‌)

● ఇక మోత మోగాల్సిందే!



ఎన్నికల ప్రచారం ఇక హోరెత్తనుంది. నెల పాటు మైకుల మోత మోగనుంది. రాజకీయ పార్టీలు ప్రచారం కోసం అన్ని హంగులు సమకూర్చుకుంటుండగా, అభ్యర్థులు, పార్టీ అధినేతల ఫొటోలతో కూడిన ప్రచార వాహనాలు సిద్ధమయ్యాయి. ఈ వాహనాల ద్వారా ఊరూరా ప్రచారాన్ని వేడెక్కించేందుకు సిద్ధమవుతున్నారు. ఖమ్మం బీఆర్‌ఎస్‌ అభ్యర్థి, మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌కు సంబంధించి ప్రచార వాహనాలు శనివారం నగరంలో ఇలా బారులుదీరి కనిపించాయి. –స్టాఫ్‌ ఫొటోగ్రాఫర్, ఖమ్మం

బొగ్గు గనులు, డిపార్ట్‌మెంట్ల వద్ద ప్రచారం నిషేధం



సింగరేణి(కొత్తగూడెం): అసెంబ్లీ ఎన్నికలను పురస్కరించుకుని గనులు, డిపార్ట్‌మెంట్ల వద్ద పార్టీ నాయకులు ప్రచారాన్ని నిషేధించారు. ఈ మేరకు సింగరేణి యజమాన్యం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఏడాది 72 మిలియన్‌ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని సంస్థ నిర్దేశించుకోగా, ఎన్నికల ప్రచారానికి అనుమతిస్తే కార్మికుల పని గంటలు వృథా అవుతాయనే భావనతో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ విషయమై యాజమాన్యం సింగరేణి వ్యాప్తంగా జీఎం కార్యాలయాలకు ఇటీవల ఉత్తర్వులు జారీ చేసి పటిష్టంగా అమలు చేయాలని సూచించారు. ఇందు కోసం సెక్యూరిటీ సిబ్బందిని అప్రమత్తం చేయాలని ఆదేశించింది. కాగా, నిబంధనలు ఉల్లంఘించి ఎవరైనా ప్రచారానికి వస్తే చర్యలు తీసుకోవడమే కాక, ఉద్యోగులు సహకరించినా శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

రూ.3.26లక్షల నగదు సీజ్‌

దమ్మపేట/కారేపల్లి: ఎన్నికల వేళ పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు. ఈ సందర్భంగా దమ్మపేట మండలంలోని మందలపల్లి చెక్‌పోస్ట్‌ వద్ద శనివారం రెండు కార్లలో తరలిస్తున్న రూ.1,86,200 నగదును గుర్తించారు. నగదు తీసుకెళ్తున్న వారి వద్ద సరైన పత్రాలు లేకపోవడంతో సీజ్‌ చేశారు. ఇక కారేపల్లి మండలంలోని క్రాస్‌రోడ్డులో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద ఎలాంటి ఆధారాలు లేకుండా తీసుకెళ్తున్న రూ.1.40 లక్షల నగదును సీజ్‌ చేసినట్లు ఎస్‌ఐ పుష్పాల రామారావు తెలిపారు.

ఏసియాడ్‌ చాంపియన్‌ షిప్‌లో ప్రతిభ


మేఘన

ఖమ్మం స్పోర్ట్స్‌: దక్షిణా కొరియాలో జరుగుతున్న అంతర్జాతీయ స్థాయి షూటింగ్‌ పోటీల్లో భారత జట్టు తరపున ఖమ్మంకు చెందిన సాధుల మేఘన బృందం పాల్గొంటోంది. ఈ సందర్భంగా 25 మీటర్ల పిస్టల్‌ ఈవెంట్‌లో రజత పతకం గెలుచుకున్నారు. ఈనెల 21న మొదలైన పోటీల్లో భారత జట్టులో తెలంగాణ నుంచి సాధుల మేఘన, హార్యాన నుంచి సిమ్రాన్, పంజాబ్‌కు చెందిన తేజస్విని ఉండగా, రజత పతకం దక్కించుకుందన్నారు. ఖమ్మం ట్రాఫిక్‌ ఏసీపీ సాదుల సారంగపాణి కుమార్తె అయిన మేఘనను రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర తదితరులు అభినందించారు.

వేంసూరుకు బేతుపల్లి జలాలు

వేంసూరు: మండలంలోని దుద్దెపూడి, కందుకూరు గ్రామాల్లో రైతులు సాగు చేస్తున్న వరి పంటకు నీరందక ఎండుతున్నాయి. దీంతో సమస్యను రైతులు ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య దృష్టికి తీసుకెళ్లారు. ఆయన బేతుపల్లి చెరువు నుంచి వేంసూరు మండలానికి శనివారం సాగునీరు విడుదల చేయించగా, రైతులు ఊపిరి పీల్చుకున్నారు.

ఇక్కడ భావప్రకటన స్వేచ్ఛ లేదు..

- న్యాయవాదుల సమ్మేళనంలో సీఎల్పీ నేత భట్టి
- హాజరైన పొంగులేటి, తుమ్మల

ఖమ్మంవన్‌టౌన్‌: ఖమ్మం నగరంలో ప్రత్యేక పరిస్థితులు ఉన్నాయని, ఇక్కడ భావప్రకటనా స్వేచ్ఛ ఖూనీ అవుతోందని సీఎల్పీ నాయకుడు మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఖమ్మంలో శనివారం న్యాయవాదుల ఆత్మీయ సమ్మేళనం కాంగ్రెస్‌ లీగల్‌ సెల్‌ బాధ్యులు ముదిరెడ్డి నిరంజన్‌రెడ్డి, జమ్ముల శరత్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యాన నిర్వహించారు. ఈ సమ్మేళనంలో భట్టి మాట్లాడుతూ కోరి కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో వనరుల దోపిడీ యథేచ్ఛగా కొనసాగుతుందన్నారు. ప్రత్యేక రాష్ట్రం సకల సమస్యలకు పరిష్కారం చూపుతుందనుకుంటే సరికొత్త సమస్యలను పాలకులు తెచ్చిపెట్టారని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్‌ అధికారంలోకి వస్తే ప్రజలు కలలు కన్న తెలంగాణ సాకారమవుతుందని తెలిపారు. ఖమ్మంలో మాట్లాడాలంటే భయం, బయటకు రావాలంటే భయపడేలా బీఆర్‌ఎస్‌ నాయకులు ప్రవర్తిస్తున్నారని ఆరోపించారు. మాజీ ఎంపీ, పాలేరు కాంగ్రెస్‌ అభ్యర్థి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ప్రజలు కాంగ్రెస్‌ పార్టీని ఆశీర్వదించేందుకు సిద్ధంగా ఉన్నందున ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్‌ అభ్యర్థుల గెలుపును ఎవరూ ఆపలేరన్నారు. తాము అధికారంలోకి రాగానే న్యాయవాదుల హౌసింగ్‌ సొసైటీ ఏర్పాటుకు కృషి చేస్తానని తెలిపారు. మాజీ మంత్రి తుమ్మల మాట్లాడుతూ నాగేశ్వరరావు ఖమ్మంలో కేసులు ఉన్న వారు ఓటేస్తే చాలు తాము గెలుస్తామన్నారు. ఇక్కడ పాలనకు చరమగీతం పాడాల్సిన సమయం ఆసన్నమైందని చెప్పారు. ఖమ్మంలో తొమ్మిది సీట్లు గెలిచిన చరిత్ర కాంగ్రెస్‌కు ఉందని, ఇప్పుడు పది గెలుస్తామన్నారు. అనంతరం పొంగులేటి పుట్టిన రోజు సందర్భంగా సత్కరించి కేక్‌ కట్‌ చేశారు. డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ లక్ష్మీనారాయణ, నాయకులు మహ్మద్‌ జావీద్, రాయల నాగేశ్వరరావు, స్వర్ణకుమారి, దొబ్బల సౌజన్య, విజయాబాయితో పాటు న్యాయవాదులు పాల్గొన్నారు.


పొంగులేటికి కేక్‌ తినిపిస్తున్న భట్టి, తుమ్మల తదితరులు

అనారోగ్యంతో మెడికో మృతి


గోపి (ఫైల్‌)

ఖమ్మంరూరల్‌: మండలంలోని ఏదులాపురం శివారు వరంగల్‌ క్రాస్‌రోడ్డుకు చెందిన యువ డాక్టర్‌ మాధారపు గోపి (27) శనివారం మృతి చెందాడు. కొంతకాలంగా ఆయన జ్వరంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని ప్రైవేట్‌ ఆస్పత్రిలో చికిత్స చేయించుకుంటున్నాడు. అక్కడే పరిస్థితి విషమించగా మృతి చెందాడు. ప్రస్తుతం గోపి ఎండీ జనరల్‌ మెడిసిన్‌ రెండో సంవత్సరం చదువుతుండగా, చేతికి అందివచ్చిన కుమారుడి మృతితో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. సీపీఐ నాయకులు దండి సురేశ్, పుచ్చకాయల సుధాకర్, వెంపటి సురేందర్, మిడకంటి చినవెంకటరెడ్డి, నంద్యాల ఆదినారాయణ, రాఘవరావు తదితరులు గోపి మృతదేహం వద్ద నివాళులర్పించారు.

విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

ఖమ్మంసహకారనగర్‌: నగరంలోని ఓ ప్రైవేట్‌ జూనియర్‌ కళాశాలలో ఇంటర్మీడియట్‌ ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన శనివారం వెలుగుచూసింది. దసరా సెలవుల అనంతరం శుక్రవారం మధ్యాహ్నమే కళాశాలకు వచ్చిన ఆమె ఫ్యాన్‌కు ఉరి వేసుకోగా, సిబ్బంది గుర్తించి కిందకు దించినట్లు సమాచారం. ఆ తర్వాత విద్యార్థినిని నగరంలోని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. ప్రస్తుతం ఆరోగ్యం మెరుగ్గానే ఉందని కళాశాల బాధ్యులు తెలిపారు.

బంగారు గొలుసు చోరీపై ఫిర్యాదు

వైరా: స్థానిక బస్టాండ్‌లో మహిళ బ్యాగు నుంచి బంగారు గొలుసు చోరీ కాగా, బాధితురాలి ఫిర్యాదు మేరకు శనివారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఏపీలోని ఎన్టీఆర్‌ జిల్లా పెనుగంచిప్రోలుకు చెందిన అందలం సీతమహాలక్ష్మి దమ్మపేటలోని బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి వస్తోంది. వైరా బస్టాండ్‌లో జగ్గయ్యపేట బస్సు ఎక్కుతుండగా బ్యాగులో ఉన్న 14 తులాల బంగారు గొలుసు చోరీకి గురైనట్లు గుర్తించింది. గొలుసు విలువ సుమారు రూ.7 లక్షలు ఉంటుందని ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

కంచె తీయిస్తారా... చావమంటారా?

తహసీల్‌ ఎదుట రైతుల ధర్నా


తహసీల్దార్‌ కార్యాలయం వద్ద ధర్నాలో రైతులు

నేలకొండపల్లి: పొలాలకు వెళ్లకుండా దారి మూసేసిన వారిపై చర్యలు తీసుకోవాలని పలువురు రైతులు శనివారం స్థానిక తహసీల్దార్‌ కార్యాలయం వద్ద ధర్నాకు దిగారు. మండలంలోని అజయ్‌తండాలో రైతుల మధ్య వివాదం కారణంగా ఓ రహదారిని కంచెతో మూసేశారు. రెండు నెలలుగా ఆ మార్గంలో వెళ్లాల్సిన రైతులు ఇబ్బంది పడుతూ తహసీల్దార్, పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని చెబుతున్నారు. ఇంతలోనే వరి కోతల సమయం సమీపించడంతో వారు శనివారం తహసీల్‌ ఎదుట ధర్నాకు దిగారు. రహదారిపై కంచె తీయిస్తారా, సామూహికంగా ఆత్మహత్య చేసుకోవాలా? తేల్చాలని డిమాండ్‌ చేశారు. అయితే, కార్యాలయంలో తహసీల్దార్‌ లేకపోవటంతో ఎస్‌ఐకి మరోమారు ఫిర్యాదు చేశారు. బాధిత రైతులు తేజావత్‌ శివాజీ, టి.నరేశ్, బాలాజీ, బోడి, పిక్కమ్మ, శ్రీను, సత్రు, బద్రి, లచ్చిబాబు, డెంకీ తదితరులు పాల్గొన్నారు.

ఘర్షణలో గాయపడిన వ్యక్తి మృతి


నాగేశ్వరరావు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని, నాయకులు

నాగేశ్వరరావు (ఫైల్‌)

- రెండు రోజుల కిందట కాంగ్రెస్‌ – సీపీఎం శ్రేణుల మధ్య గొడవ
- ఒకరి మృతితో గోవిందాపురం(ఎల్‌)లో భారీ బందోబస్తు
- 16 మందిపై కేసు నమోదు, కాంగ్రెస్‌ నుంచి ఒకరి సస్పెండ్‌

బోనకల్‌: మండలంలోని గోవిందాపురం(ఎల్‌) గ్రామంలో గురువారం అర్ధరాత్రి దుర్గామాత శోభాయాత్ర సందర్భంగా కాంగ్రెస్, సీపీఎం వర్గీయుల మధ్య ఘర్షణ జరగగా.. గాయపడిన ఎర్రబోయిన నాగేశ్వరరావు(38) మృతి చెందాడు. ఘటనలో తీవ్రంగా గాయపడిన ఆయన్ను ఖమ్మంలోని కిమ్స్‌ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున కన్నుమూశాడు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. గత నెల 24వ తేదీన గ్రామంలో రామాలయ నిర్మాణం విషయంలో తలెత్తిన వివాదం రెండు పార్టీల మధ్య ఘర్షణకు దారితీసింది. ఈ ఘర్షణలో ఇరువర్గాలకు చెందిన వారు గాయపడగా 50 మందిపై కేసు నమోదైంది. ఆనాటి నుంచి గ్రామంలో ఘర్షణ వాతావరణం నెలకొనగా, గురువారం అర్ధరాత్రి దుర్గామాత విగ్రహం నిమజ్జనం సందర్భంగా ఊరేగింపులో పరస్పరం దాడులు చేసుకున్నారు. ఈ ఘటనలో సీపీఎంకు చెందిన నలుగురికి గాయాలు కాగా నాగేశ్వరరావు మృతి చెందాడు.

ఎన్నికలొస్తే ఘర్షణలు

గోవిందపురం(ఎల్‌)ను పోలీసులు ఇప్పటికే సమస్యాత్మక గ్రామంగా గుర్తించారు. ప్రతీ ఎన్నికల్లో ఇక్కడ ఘర్షణలు సర్వసాధారణమయ్యాయి. 1977లో సీపీఎంకు చెందిన జొన్నలగడ్డ రామయ్య హత్యకు గురయ్యాడు. 1982లో కాంగ్రెస్‌ పార్టీకి చెందిన ఉమ్మినేని రామారావు హత్య జరిగింది. ఇక ఇప్పుడు సీపీఎంకు చెందిన ఎర్రబోయిన నాగేశ్వరరావు హత్యకు గురికాగా.. స్థానికుల్లో ఆందోళన నెలకొంది.

అరాచకవాదులకు గుణపాఠం తప్పదు

గ్రామంలో ప్రశాంత వాతావరణాన్ని చెడగొట్టేలా ఘర్షణకు దిగుతున్న కాంగ్రెస్‌ అరాచక వాదులకు తగిన గుణపాఠం తప్పదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు హెచ్చరించారు. హత్యకు గురైన ఎర్రబోయిన నాగేశ్వరరావు మృతదేహం వద్ద నివాళులర్పించాక వారు మాట్లాడారు. సీపీఎం నాయకులపై దాడి చేయడమే కాక ఇళ్లను ధ్వంసం చేసిన సర్పంచ్‌ ఉమ్మినేని బాబు, ఆయన కుమారుడు రమేశ్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేశారు. ఇక్కడి అరాచకాలను ఎమ్మెల్యే భట్టి విక్రమార్క దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేక ఇప్పుడు హత్య జరిగిందని తెలిపారు. పోలీసులు సైతం స్పందించకపోవడంతో నిండు ప్రాణం బలైందన్నారు. నాయకులు పొన్నం వెంకటేశ్వరరావు, పొలడుగు భాస్కర్, బండి రమేశ్, చింతలచెర్వు కోటేశ్వరరావు, దొండపాటి నాగేశ్వరరావు పాల్గొనగా, జెడ్పీ చైర్మన్‌ లింగాల కమల్‌రాజ్‌ కూడా నాగేశ్వరరావు మృతదేహం వద్ద నివాళులర్పించారు. కాగా, బోనకల్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్‌ మాట్లాడుతూ.. హత్యారాజకీయాలు తమ పార్టీ సంస్కృతి కాదని తెలిపారు. గ్రామంలో అంతర్గత, వ్యక్తిగత సమస్యలను ఎమ్మెల్యేకు ఆపాదించొద్దని చెప్పారు. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులు విఫలమయ్యారని ఆరోపించారు. హత్యకు బాధ్యుడైన కాంగ్రెస్‌ నాయకుడు ఉమ్మినేని రమేశ్‌ను పార్టీ నుంచి సస్పెండ్‌ చేస్తున్నట్లు వెల్లడించారు. జెడ్పీటీసీ మోదుగు సుధీర్‌బాబు, కాంగ్రెస్‌ మండల అధ్యక్షుడు గాలి దుర్గారావు, నాయకులు కర్నాటి కోటి, చేబ్రోలు వెంకటేశ్వర్లు, సుబ్బారావు, నాని, నాగేశ్వరరావు, సురేందర్‌ తదితరులు పాల్గొన్నారు.


గ్రామంలో పోలీసు బందోబస్తు

16 మందిపై కేసు నమోదు

దాడిలో గాయపడిన ఎర్రబోయిన నాగేశ్వరరావు కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు 16 మందిపై హత్య కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సాయికుమార్‌ తెలిపారు. వీరంతా పరారీలో ఉన్నారని పేర్కొన్నారు. గ్రామంలో ఘర్షణ నేపథ్యాన రెండు రోజులుగా భారీ పోలీస్‌ బందోబస్తు ఏర్పాటు చేశారు. అడిషినల్‌ డీసీపీ కేఆర్‌కే ప్రసాద్‌రావు ఆధ్వర్యాన ఆరుగురు ఏసీపీలు, ఎనిమిది మంది సీఐలు, పది మంది ఎస్‌ఐలు సహా 80 మందితో బందోబస్తు కొనసాగుతోంది.

క్లుప్తంగా...

అంబటిపై దాడి ఘటనలో కేసులు నమోదు

- నిందితులైన ఏడుగురు టీడీపీ నేతల గుర్తింపు
- ఘటనను ఖండించిన మున్నూరు కాపు సంక్షేమ సంఘం

ఖమ్మం మయూరిసెంటర్/ఖమ్మం క్రైం: ఖమ్మంలో శుక్రవారం ఏపీ మంత్రి అంబటి రాంబాబు కాన్వాయ్‌ను అడ్డుకుని కర్రలతో బీభత్సం సృష్టించిన టీడీపీ నాయకులు కేతినేని హరీశ్, కాంపాటి విజయ్‌కుమార్, రామాంజనేయ, జయ, నర్వనేని శంకర్, నాగండ్ల లక్ష్మణ్‌రావు, మందడపు కోటిపై ఖమ్మం వన్‌టౌన్ పోలీసులు కేసులు నమోదు చేశారు. ఘటనపై మంత్రి గన్‌మేన్ జంగం కిరణ్ ఫిర్యాదు మేరకు శనివారం నిందితులపై కేసులు నమోదు చేసినట్లు సీఐ స్వామి తెలిపారు. కాగా, శుభకార్యానికి వచ్చిన అతిథులను అగౌరవపరచడం, దాడులకు ప్రయత్నించడం సంప్రదాయం కాదని, ఏపీ మంత్రి అంబటిని దుర్భాషలాడుతూ దాడికి యత్నించడం గర్హనీయమని మున్నూరుకాపు సంక్షేమ సంఘం పేర్కొంది. ఈ మేరకు సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షుడు పారా నాగేశ్వరరావు, రాష్ట్ర బాధ్యులు ఆకుల గాంధీ, శెట్టి రంగారావు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు.

ఏపీలో తేలికపాటి వర్షాలు



సాక్షి, విశాఖపట్నం: రాష్ట్రంలో కొన్నాళ్లుగా వాతావరణం పొడిగా ఉంది. కొన్ని ప్రాంతాల్లో ఉష్ణోగ్రతల్లో మార్పు వల్ల ఉక్కపోత ఉంటోంది. తాజాగా గాలుల దిశ మారిన కారణంగా తూర్పు, ఆగ్నేయ గాలులు రాష్ట్రంపై ప్రభావం చూపుతున్నాయి. దీంతో ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పడుతున్నాయి. అదే సమయంలో తేలికపాటి జల్లులు లేదా వర్షాలకు ఆస్కారం ఉందని భారత వాతావరణశాఖ శనివారం ఓ నివేదికలో తెలిపింది. రానున్న మూడు రోజుల్లో కోస్తాంధ్ర, రాయలసీమల్లో ఒకట్రెండు చోట్ల జల్లులు గాని, తేలికపాటి వర్షం గాని కురవవచ్చని పేర్కొంది. అదే సమయంలో ఉరుములు, మెరుపులకు ఆస్కారం ఉందని అంచనా వేసింది.




వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరులో జరిగిన సామాజిక సాధికార యాత్రకు హాజరైన జనసందోహం • విశాఖ జిల్లా తగరపువలస సభలో పాల్గొన్న అశేష జనవాహిని

సామాజిక విప్లవ సారథి జగన్‌కు జేజేలు

- మూడో రోజూ ప్రభంజనంలా వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికార బస్సు యాత్ర
- భీమిలి, బాపట్ల, ప్రొద్దుటూరు నియోజకవర్గాల్లో యాత్రకు విశేష స్పందన
- రేపు పాడేరు, దెందులూరు, ఉదయగిరి నియోజకవర్గాల్లో బస్సు యాత్ర

సాక్షి, అమరావతి/సాక్షి, విశాఖపట్నం/ సాక్షి, బాపట్ల/సాక్షి, కడప: సామాజిక విప్లవ సారథి వైఎస్ జగన్ పరిపాలనకు ప్రజలు అడుగడుగునా జేజేలు పలుకుతున్నారు. వైఎస్సార్‌సీపీ చేపట్టిన సామాజిక సాధికార యాత్రను హర్షాతిరేకాలతో స్వాగతిస్తున్నారు. 'జగనన్నే మా భవిష్యత్తు.. జగనే రావాలి.. జగనే కావాలి' అంటూ అన్ని వర్గాలూ ఒక్క గళమై నినదిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికార బస్సు యాత్రకు మూడో రోజు శనివారం ప్రజలు నీరాజనం పలికారు. గత 53 నెలలుగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, అగ్రవర్ణ పేదలకు చేస్తున్న మంచిని వివరించడానికి సీఎం జగన్ నాయకత్వంలో వైఎస్సార్‌సీపీ చేపట్టిన సామాజిక సాధికార యాత్ర శనివారం విశాఖ జిల్లా భీమిలి, బాపట్ల జిల్లా బాపట్ల, వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరులో జరిగింది. ఈ బస్సు యాత్ర సోమవారం అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు, ఏలూరు జిల్లా దెందులూరు, పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఉదయగిరి నియోజకవర్గాల్లో జరగనుంది.

జగనే కావాలి అంటూ హోరెత్తిన భీమిలి

భీమిలిలో స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో చేపట్టిన సామాజిక సాధికార బస్సు యాత్రను ఎండాడలోని పార్టీ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, మంత్రులు బొత్స సత్యనారాయణ, మేరుగు నాగార్జున, సీదిరి అప్పలరాజు, కారుమూరి నాగేశ్వరరావు ప్రారంభించారు. ఆనందపురం మండలం బోయిపాలెం కూడలి నుంచి 2 వేలకు పైగా బైక్‌లు, వందకు పైగా కార్లతో ర్యాలీగా యాత్ర ప్రారంభమై జాతీయ రహదారి మీదుగా తగరపువలస చిట్టివలస ఫుట్‌బాల్ గ్రౌండ్ వద్ద గల బహిరంగ సభ స్థలి వద్దకు చేరింది. పర్యటన ఆసాంతం 'జగనే కావాలి – జగనే రావాలి'అంటూ ప్రజలు చేసిన నినాదాలతో హోరెత్తింది.

బాపట్లలో అపూర్వ స్పందన

బాపట్ల నియోజకవర్గంలో బస్సు యాత్రకు అపూర్వ స్పందన లభించింది. యాత్రకు ప్రజలు పూల తివాచీలతో ఘనస్వాగతం పలికారు. విద్య, వైద్యం తదితర విభాగాల్లో జరిగిన అభివృద్ధిని ఎంపీ విజయసాయిరెడ్డి ప్రజలకు వివరించారు. యాత్ర రెడ్డిపాలెం, కర్లపాలెం మీదుగా సాయంత్రం 5.30 గంటలకు బాపట్ల చేరుకుంది. నియోజకవర్గంలోని యువకులు అధిక సంఖ్యలో ద్విచక్రవాహనాలతో భారీ ర్యాలీ చేశారు. అంబేడ్కర్ సెంటర్‌లో సభ జరిగింది. వైఎస్ జగన్ సీఎం అయిన తర్వాత బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు చేస్తున్న మేలును మంత్రులు వివరించిన సమయంలో ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు.

జనసంద్రంగా మారిన పసిడిపురి

పసిడిపురి ప్రొద్దుటూరులో సామాజిక సాధికార యాత్ర జనజాతరలా సాగింది. ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి నియోజకవర్గ నేతలతో కలిసి బస్సు ముందు నడుస్తుండగా మహిళలు వైఎస్సార్‌సీపీ జెండాలతో స్వాగతం పలికారు. యువత భారీ బైక్ ర్యాలీ చేశారు. శివాలయం సెంటర్‌లో అసంఖ్యాక జనం మధ్య బహిరంగ సభ జరిగింది. దసరా ఉత్సవాలకు పసిడిపురి పెట్టింది పేరు. భారీ స్థాయిలో ప్రజానీకం వీటిని వీక్షిస్తుంటారు. శనివారం సామాజిక సాధికార యాత్ర కూడా ఇదే ఉత్సవాలను తలపించింది.

శ్రీవారి సేవలో హైకోర్టు సీజే



ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ శనివారం శ్రీవారిని, తిరుచానూరు పద్మావతి అమ్మవారిని కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. వారికి అధికారులు ప్రసాదాలు, వేద పండితులు ఆశీర్వచనాలు అందజేశారు.

టీటీడీ డైరీలు, కేలండర్ల విక్రయం

తిరుమల: టీటీడీ ముద్రించిన 2024వ సంవత్సరం డైరీలు, కేలండర్లను తిరుమల, తిరుపతిల్లోని అన్ని టీటీడీ పుస్తక విక్రయశాలల్లో విక్రయిస్తున్నారు. ttdevasthanams.ap.gov. in లో కేలండర్లు, డైరీలు, టేబుల్ టాప్ కేలండర్లను కొనుగోలు చేయవచ్చు. 12 పేజీల కేలండర్ రూ.130, డైరీ (డీలక్స్) రూ.150, డైరీ (చిన్నది) రూ.120, టేబుల్ టాప్ కేలండర్ రూ.75, ఆరు పేజీల కేలండర్ రూ.450, శ్రీవారిపెద్ద కేలండర్ రూ.20, శ్రీవారు, శ్రీ పద్మావతి అమ్మవారి కేలండర్ రూ.15, శ్రీ పద్మావతి పెద్ద కేలండర్ రూ.20, తెలుగు పంచాంగం కేలండర్ రూ.30గా ధరను టీటీడీ నిర్ణయించింది. చెన్నైలోని శ్రీ వేంకటేశ్వరస్వామి, శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయాలు, హైదరాబాద్, బెంగళూరు, విజయవాడ, విశాఖల్లోని శ్రీవారి ఆలయాలు, ముంబై, న్యూఢిల్లీ, వేలూరు, కాంచీపురంలోని సమాచార కేంద్రాలు, నెల్లూరు, రాజమహేంద్రవరం, కాకినాడ, కర్నూలుల్లోని టీటీడీ కల్యాణమండపాల్లో కేలండర్లు, డైరీలు విక్రయాల కోసం అందుబాటులో టీటీడీ ఉంచింది.

విజయవాడలోనూ పాస్‌పోర్ట్ ప్రింటింగ్

- జనవరి నుంచి నూతన ప్రాంతీయ పాస్‌పోర్ట్ కార్యాలయం
- విజయవాడ ప్రాంతీయ పాస్‌పోర్ట్ అధికారి శివహర్ష



సాక్షి, అమరావతి: 2024 జనవరి నుంచి విజయవాడలో కొత్త ప్రాంతీయ పాస్‌పోర్ట్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్నట్టు ప్రాంతీయ పాస్ట్‌పోర్ట్ అధికారి శివహర్ష వెల్లడించారు. విజయవాడ ప్రాంతీయ పాస్‌పోర్ట్ కార్యాలయ(ఆర్‌పీవో) అధికారులతో శనివారం ఆయన సమన్వయ సమావేశం నిర్వహించి.. అనంతరం మీడియాతో మాట్లాడారు. ఇప్పటి వరకు విజయవాడ ప్రాంతీయ పాస్‌పోర్ట్ కార్యాలయం సేవా కేంద్రంగా ఉందని.. గవర్నర్‌పేటలోని ఏజీ ఆఫీస్ కాంప్లెక్స్‌లో వచ్చే జనవరి నుంచి ప్రారంభించే కొత్త ప్రాంతీయ పాస్‌పోర్ట్ కార్యాలయం విస్తృత సేవలు అందించనుందని తెలిపారు. ప్రస్తుతం విశాఖపట్నం ప్రాంతీయ కార్యాలయంలోనే పాస్‌పోర్ట్ ప్రింటింగ్ సౌలభ్యం ఉందని, ఇకపై విజయవాడ నూతన కార్యాలయంలోనూ ఈ సేవలు అందుబాటులోకొస్తాయన్నారు. పాస్‌పోర్ట్ ప్రింటింగ్, డిస్పాచ్‌తో పాటు అడ్మినిస్ట్రేషన్(పరిపాలన), పాలసీ సంబంధిత సేవలనూ విజయవాడ కార్యాలయం అందిస్తుందని తెలిపారు. ఏపీలోని 15 జిల్లాలకు చెందిన పాస్‌పోర్ట్ దరఖాస్తుదారులకు విజయవాడ, తిరుపతి పాస్‌పోర్ట్ సేవా కేంద్రాలు(పీఎస్‌కే), 13 పోస్ట్ ఆఫీస్ పాస్‌పోర్ట్ సేవా కేంద్రాల(పీఓపీఎస్‌కే) ద్వారా సేవలందిస్తున్నామని, మిగతా జిల్లాలకు విశాఖ ప్రాంతీయ కార్యాలయం సేవలందిస్తుందని చెప్పారు. గతంలో పాస్‌పోర్ట్ స్లాట్ బుకింగ్‌కు నెల పట్టేదని, ప్రస్తుతం ఐదు నుంచి 12 రోజులే పడుతోందన్నారు. విజయవాడ కార్యాలయ పరిధిలో రోజుకు 2 వేల పాస్‌పోర్ట్ దరఖాస్తులను క్లియర్ చేస్తున్నట్టు తెలిపారు. పాస్ట్‌పోర్ట్ సేవల వినియోగానికి అధికారిక వెబ్‌సైట్‌ను వినియోగించుకోవాలని, నకిలీ వెబ్‌సైట్‌లు, ఏజెంట్లను నమ్మొద్దని కోరారు.

సిటీ ఆఫ్ డెస్టినీ.. విశాఖ

- అత్యంత ప్రభావవంతమైన విద్యా సంస్థలు, పరిశ్రమలకు నగరం నిలయం
- ఆంధ్రా వైద్య కళాశాల శతాబ్ది ఉత్సవాల్లో ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్



ఆంధ్రా మెడికల్ కాలేజీ వద్ద విద్యార్థులతో ముచ్చటిస్తున్న ఉప రాష్ట్రపతి జగదీప్

సాక్షి, విశాఖపట్నం: అత్యంత ప్రభావవంతమైన విద్యాసంస్థలు, పరిశ్రమలతోపాటు ఆకర్షణీయమైన బీచ్‌లు ఉన్న విశాఖ నగరం నిజంగా 'సిటీ ఆఫ్ డెస్టినీ'అని ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ కొనియాడారు. ముఖ్యంగా హైటెక్ వైద్య పరికరాల తయారీ, ఎగుమతుల్లో విశాఖపట్నంలోని ఏపీ మెడ్‌టెక్ జోన్ ప్రపంచంలోనే కీలక పాత్ర పోషిస్తోందన్నారు. మరింత పురోభివృద్ధి సాధించేందుకు అవసరమైన నిపుణులు రాష్ట్రంలో ఉన్నారని ప్రశంసించారు. ఆంధ్రా వైద్య కళాశాల (ఏఎంసీ) శతాబ్ది ఉత్సవాలకు ముఖ్య అతిథిగా హాజరయ్యేందుకు ఉపరాష్ట్రపతి జగదీప్ ధనకర్ శనివారం విశాఖ చేరుకున్నారు. ముందుగా ఐఎన్ఎస్ డేగాలో తూర్పు నౌకాదళం, రాష్ట్ర ప్రభుత్వం అందించిన గార్డ్ ఆఫ్ ఆనర్, గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం అక్కడి నుంచి నేరుగా ఆంధ్రా వైద్య కళాశాలకు చేరుకున్న ఉపరాష్ట్రపతి ఏఎంసీ శతాబ్ది ఉత్సవాల పైలాన్‌ని గవర్నర్ అబ్దుల్ నజీర్, మంత్రులు విడదల రజని, గుడివాడ అమర్‌నాథ్, ఎంపీలు ఎంవీవీ సత్యనారాయణ, సత్యవతితో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఏఎంసీలో రూ.20 కోట్లతో నిర్మించనున్న క్లినికల్ అండ్ బయోమెడికల్ రీసెర్చ్ సెంటర్‌కు జగదీప్ ధన్‌ఖడ్ శంకుస్థాపన చేసి.. కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఆ తర్వాత బీచ్ రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన ఉత్సవాల సదస్సులో పాల్గొన్నారు. ఏఎంసీ సెంటినరీ కాఫీ బుక్, పోస్టల్ కవర్, స్టాంప్‌ని ఆవిష్కరించారు.

జిల్లా వార్తలు

'శ్రౌత యజ్ఞ పరిచయం' గ్రంథావిష్కరణ



గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న స్వరూపానందేంద్ర స్వామి

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం రామాయణ పారాయణదారులు ఎస్టీజీ అంతర్వేది కృష్ణమాచార్యులు రచించిన 'శ్రౌత యజ్ఞ పరిచయం' గ్రంథాన్ని శనివారం ఆవిష్కరించారు. విశాఖపట్నంలోని శారదా పీఠంలో ఈ గ్రంథాన్ని పీఠాధిపతి శ్రీ స్వరూపానందేంద్ర స్వామి ఆవిష్కరించి ఆశీర్వదించారు. అనంతరం స్వామిజీ మాట్లాడుతూ.. తెలుగులో శ్రౌత యజ్ఞాలపై గ్రంథ రచనలు లేవని, ఆ ప్రయత్నంలో విజయం సాధించిన కృష్ణమాచార్యులు అభినందనీయుడని తెలిపారు. శ్రౌత యజ్ఞసభలు ప్రతీ మాఘమాసంలో శారదా పీఠంలో నిర్వహిస్తామని, తెలుగునాట సభలు నిర్వహించే ఏకైక పీఠం విశాఖ శారదా పీఠమేనని వెల్లడించారు. కార్యక్రమంలో పలువురు ఆధ్యాత్మిక వేత్తలు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్‌లో నల్లకొమ్ము పురుగు



తోటలో పరిశీలిస్తున్న జినుగు మరియన్న

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఆయిల్‌పామ్‌తో పాటు కొబ్బరి తోటల్లో లేత ఆకులను నల్లకొమ్ము పురుగు ఆశించినట్లు అధికారులు గుర్తించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని సుజాతనగర్, జూలూరుపాడు, చండ్రుగొండ, అన్నపురెడ్డిపల్లి, లక్ష్మీదేవిపల్లి మండలాల్లో సాగుచేస్తున్న ఆయిల్‌పామ్, డ్రాగన్‌ఫ్రూట్, మామిడి, జామ, బొప్పాయి, అరటి, కూరగాయల తోటలను శనివారం జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖాధికారి జినుగు మరియన్న సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నల్లకొమ్ము పురుగు ఆయిల్ పామ్, కొబ్బరి తోటలను నష్టపరుస్తోందని తెలిపారు. ఈ మేరకు 20 గ్రాముల ఫోరెట్ గుళికలను మొవ్వలో పెట్టాలని, లింగాకర్షణ బుట్టలు వాడాలని సూచించారు. అలాగే, జీవ నియంత్రణ పద్ధతులు పాటించాలని పేర్కొన్నారు.

పేదలకు 'పెద్ద' సేవలు

- జిల్లా ఆస్పత్రిలో వేయి దాటిన క్యాథల్యాబ్ చికిత్సలు
- ఇరవై నెలల్లో ఓపీ 16,169గా నమోదు
- నిరుపేదలకు తప్పుతున్న వ్యయప్రయాసలు



కార్డియాలజీ విభాగం వైద్యులు, సిబ్బందిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రాజేశ్వరరావు, తదితరులు

ఖమ్మం వైద్యవిభాగం: ఖమ్మం జిల్లా ప్రధాన ఆస్పత్రిలో ఇటీవల క్యాథల్యాబ్ సేవలకు తరచూ అంతరాయం కలుగుతున్నా గుండె సంబంధిత వ్యాధులతో బాధపడే వారికి చికిత్స విషయంలో జోరు తగ్గడం లేదు. క్యాథల్యాబ్ ద్వారా ఇప్పటి వరకు వేయి మందికి వివిధ రకాల శస్త్రచికిత్స నిర్వహించిన వైద్యులు, సిబ్బంది భేష్ అనిపించుకున్నారు. గుండె వైద్య నిపుణులు డాక్టర్ సీతారాం, సిబ్బంది కృషితో వైద్యసేవలు మెరుగుపడ్డాయి. తరచూ కాంట్రాస్ట్ ఇంజక్షన్ల సరఫరాలో అంతరాయం కలుగుతున్నా, బయట నుండి తెప్పించి మరీ చికిత్స కొనసాగిస్తుండడంతో నిరుపేదలకు లబ్ధి జరుగుతోంది.

గత ఏడాది ఫిబ్రవరిలో ప్రారంభం

ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో క్యాథలాబ్ సేవలు గత ఏడాది ఫిబ్రవరి 23వ తేదీన ప్రారంభించారు. సుమారు రూ.7 కోట్ల వ్యయంతో ఏర్పాటుచేసిన యంత్రాల ద్వారా సేవలు విస్తృతమయ్యాయి. గడిచిన ఇరవై నెలల కాలంలో గుండె విభాగానికి 1,004 మందికి శస్త్రచికిత్సలు నిర్వహించడం విశేషం. గతంలో మాదిరి హైదరాబాద్ వంటి నగరాలకు వెళ్లనవసరం లేకుండా జిల్లా కేంద్రంలో ఉచితంగా చికిత్స అందుబాటులోకి రావడంతో నిరుపేదలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. క్యాథల్యాబ్ ద్వారా యాంజియోగ్రామ్, యాంజియోప్లాస్టీ, పేస్‌మేకర్లు, గుండె సంబంధిత లోపాలు తెలుసుకుని చికిత్స అందిస్తున్నారు. గుండె కొట్టుకోవటంలో లోపాలు ఈ మిషన్ ద్వారా తెలుసుకొని సరిచేయడం, గుండెకు రక్తాన్ని తీసుకెళ్లే నాళాలు పాడైతే స్టంట్లు వేయడం జరుగుతోంది. గుండె కవాటాల మార్పిడి, గుండె చుట్టూ నీరు చేరితే తొలగింపు, గుండెకు రక్తం పంపింగ్‌లోనూ లోపాలను సరిచేయడమే కాక చిన్నపిల్లల గుండెకు రంధ్రం పడితే వాటిని పూడ్చడానికి ఇక్కడ అన్ని వసతులు సమకూరాయి.

ఉద్యోగులకు అభినందల వెల్లువ

క్యాథల్యాబ్ ద్వారా పెద్దాస్పత్రిలో వేయి చికిత్సలు విజయవంతంగా పూర్తిచేసిన సందర్భంగా కార్డియాలజీ విభాగంలో శనివారం ఉద్యోగులను అభినందించారు. మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరరావు, సూపరింటెండెంట్ బి.వెంకటేశ్వర్లు, ఆర్ఎంఓ బి.శ్రీనివాసరావు ఆధ్వర్యాన కేక్ కట్ చేశారు. గడిచిన ఇరవై నెలల్లో ప్రభుత్వ పరంగా 1,004 మంది గుండె సంబంధిత బాధితులకు శస్త్రచికిత్స చేయడంపై అభినందించారు. ఇందులో కరోనరీ యాంజియోగ్రామ్ 604, యాంజియోప్లాస్టీ 352, టెంపరరీ పేస్ మేకర్ ఇంప్లాటేషన్ 17, రేనల్ యాంజియోగ్రామ్ 11, పెరికార్డియో సెంటిసిస్ 10, పెరిపెరల్ యాంజియోగ్రామ్, గ్రాఫ్ట్ యాంజియోగ్రామ్, కరోటిడ్ యాంజియోగ్రామ్ రెండేసి చొప్పున ఉన్నాయి. అలాగే, బ్రాంకియల్ యాంజియోగ్రామ్, రూట్ యాంజియోగ్రామ్, వెంట్రికులర్ సెప్టల్ డివైస్ క్లోజర్, ఫ్లూరోస్కోపీ పోస్ట్ ఎంవీఆర్ చికిత్స ఒక్కొక్కటి ఉంది.

విస్తృతమైన ఓపీ సేవలు

గతంలో ఇక్కడ ప్రభుత్వ పరంగా గుండె రోగులకు సంబంధించి చికిత్స అందుబాటులో లేదు. దీంతో ప్రైవేట్ ఆస్పత్రులే దిక్కయ్యేవి. ఖరీదైన వైద్యం కావటంతో స్థోమత ఉన్న వారు హైదరాబాద్ తదితర పట్టణాలకు వెళ్లి వైద్యం చేయించుకునే వారు. కానీ నిరుపేదలకు ఆ అవకాశం లేక గాలిలో దీపం పెట్టిన చందంగా బతుకుపై ఆశలు వదిలేసుకునేవారు. అయితే, జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కార్డియాలజీ విభాగం ఏర్పాటైన తర్వాత పరిస్థితులు మారాయి. నిరుపేదలకు గుండె చికిత్స అందుబాటులోకి రావటంతో ఓపీ సేవలు మెరుగుపడ్డాయి. గడిచిన ఇరవై నెలల కాలంలో 16,169 మంది ఈ విభాగంలో ఓపీ సేవలు పొందారు.

సీఎంపీఎఫ్ అధికారులతో ద్వైపాక్షిక సమావేశం

పెన్షన్ అదాలత్‌పై సమీక్షించిన సింగరేణి డైరెక్టర్



మాట్లాడుతున్న డైరెక్టర్ బలరామ్

సింగరేణి(కొత్తగూడెం): పెన్షన్ అదాలత్, సింగరేణి కార్మికులు, కాంట్రాక్ట్ కార్మికులు, వితంతు పెన్షన్‌పై సింగరేణి డైరెక్టర్ (పా) ఎన్.బలరామ్ సమీక్షించారు. కొత్తగూడెంలోని కార్పొరేట్ కార్యాలయంలో శనివారం సీఎంపీఎఫ్ అధికారులతో సమావేశమై మాట్లాడారు. పెన్షన్ క్లెయిమ్‌ల పరిష్కారం, రివైజ్డ్ నామినేషన్ ఫారంలు సమర్పించేటప్పుడు కుటుంబ సభ్యులు / డిపెండెంట్ల పాన్‌కార్డ్, ఆధార్‌కార్డులు జత చేయాలని సూచించారు. సీఎంపీఎఫ్ సంస్థ ద్వారా జారీ చేసిన పీఎఫ్, పెన్షన్ క్లెయిమ్ సెటిల్‌మెంట్ కోసం ఎస్‌ఓపీ అమలు చేయాలని, కాంట్రాక్ట్ కార్మికులందరికీ సీఎంపీఎఫ్ వర్తింపజేయాలని తెలిపారు. ఆ తర్వాత పెన్షన్ గ్రీవెన్స్ సమస్యలపై చర్చించారు. సమావేశంలో జీఎం పర్సనల్ (వెల్ఫేర్ అండ్ ఆర్సీ) కట్టా బసవయ్య, సీఎంపీఎఫ్ అసిస్టెంట్ కమిషనర్ ఎం.కనకమ్మతోపాటు అధికారులు ఎం.సుబ్బారావు, సూర్యనారాయణ, కోడూరు శ్రీనివాసరావు, వైవీఎల్ వరప్రసాద్, ఎస్.వెంకటేశ్వరరావు, సత్యనారాయణ, వేణుగోపాల్‌రావు, రాజేశ్వరరావు, ఎల్.తిరుపతి, కె.ప్రవీణ్ కుమార్, పీఎంకే.ప్రసాద్, వెంకటేశ్వర్లు, మధుబాబు, వి.సులోచన తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులపై మావోయిస్టుల దాష్టీకం

భద్రాద్రి జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్



బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న ఎస్పీ

చర్ల: సరిహద్దు అటవీ ప్రాంతాల్లో నివసిస్తున్న గిరిజనులపై మావోయిస్టులు వ్యవహరిస్తున్న తీరు సరికాదని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ పేర్కొన్నారు. పోలీసులను లక్ష్యంగా చేసుకుని మావోయిస్టులు ఏర్పాటు చేసిన ప్రెజర్ బాంబు దాటికి పూసుగుప్పకు చెందిన ఓ గిరిజనుడి ఆవు మృతి చెందింది. దీంతో శనివారం గ్రామానికి వచ్చిన ఎస్పీ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అడవినే నమ్ముకొని జీవనాన్ని సాగిస్తున్న ఆదివాసీలు, గిరిజనులపై దాడులు చేయడం, విధ్వంసాలకు పాల్పడడం మావోయిస్టులకు అలవాటుగా మారిందని విమర్శించారు. కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాలను పోషిస్తున్న ఆదివాసీలు, గిరిజనుల దగ్గర నుంచి సమావేశాల పేరుతో బలవంతంగా వసూళ్లకు పాల్పడుతున్నారని చెప్పారు. అంతేకాక పనులు మానుకుని సభలకు రావాలని హెచ్చరించడం ఏమిటని ప్రశ్నించారు. అటవీ ప్రాంతాల్లో నిత్యం గిరిజనులు సంచరిస్తుంటారని, ఈ క్రమంలో పోలీసులను లక్ష్యంగా చేసుకొని మావోయిస్టులు ఏర్పాటు చేస్తున్న ప్రెజర్ బాంబుల తీరుతో వారి ప్రాణాలు పోతే ఎవరు బాధ్యత వహిస్తారో చెప్పాలని నిలదీశారు. కాగా, ఆదివాసీల మనుగడకు ముప్పుగా, అభివృద్ధికి ఆటంకంగా మారిన మావోయిస్టులను గ్రామాల్లోకి రాకుండా తరిమికొట్టాలని ఎస్పీ పిలుపునిచ్చారు. అనంతరం బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందించారు. భద్రాచలం ఏఎస్పీ పరితోజ్ పంకజ్, ఓఎస్డీ టి.సాయిమనోహర్, సీఐలు బి.రాజగోపాల్, రాజువర్మ పాల్గొన్నారు.

సీఎం సభలకు చకచకా ఏర్పాట్లు

భారీగా జన సమీకరణకు కసరత్తు



సభా వేదికను పరిశీలిస్తున్న ఎంపీ రవిచంద్ర, నాయకులు

ఇల్లెందు/కామేపల్లి/పాల్వంచ: ఎన్నికల ప్రచారంలో భాగంగా వచ్చేనెల 1వ తేదీ ఇల్లెందు నియోజకవర్గ స్థాయి ప్రజా ఆశీర్వాద సభకు సీఎం కేసీఆర్ హాజరుకానున్నారు. ఇందుకోసం మండలంలోని మొట్లగూడెం వెళ్లే దారిలో సుమారు 15 ఎకరాల స్థలాన్ని ఎంపిక చేశారు. ఇప్పటికే అక్కడ సభావేదిక, బారికేడ్ల నిర్మాణం, హెలీప్యాడ్ ఏర్పాటుపై దృష్టి సారించారు. శనివారం బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర మైదానాన్ని పరిశీలించారు. తొలుత ఇల్లెందులోని బీఆర్ఎస్ కార్యాలయంలో ముఖ్యనేతలతో సమావేశమై సభకు జనం తరలింపు, తదితర అంశాలపై సూచనలిచ్చారు. అలాగే, కామేపల్లి మండలం కొత్తలింగాలలో జరిగిన సమావేశంలో కూడా ఎంపీ వద్దిరాజు పాల్గొని జనసమీకరణపై సూచనలు చేశారు. గ్రంథాలయ సంస్థ భద్రాద్రి జిల్లా చైర్మన్ దిండిగల రాజేందర్, నాయకులు బానోత్ హరిసింగ్‌నాయక్, జానీపాషా, సుధీర్ తోత్లా, సిలివేరు సత్యనారాయణ, మెట్టెల కృష్ణ, జానీబాబా, కృష్ణప్రసాద్, చీమల వెంకటేశ్వర్లు, ధనియాకుల హన్మంతరావు, ఆంతోటి అచ్చయ్య, మూడ్ కృష్ణప్రసాద్‌నాయక్, బోడేపూడి వీరప్రతాప్‌బాబు, వడియాల కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఇక పాత పాల్వంచలోని ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు ఇంట్లో జరిగిన సమావేశంలో వద్దిరాజు మాట్లాడుతూ నవంబర్ 5వ తేదీన సీఎం కేసీఆర్ హాజరయ్యే బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభకు జన సమీకరణపై ఇప్పటి నుంచే దృష్టి సారించాలని సూచించారు. జెడ్పీ, కొత్తగూడెం మున్సిపల్ వైస్ చైర్మన్లు కంచర్ల చంద్రశేఖర్‌రావు, వి.దామోదర్‌తో పాటు నాయకులు సర్దార్, పురుషోత్తంరావు, ఆది విష్ణుమూర్తి, కాసుల వెంకట్, కిలారు నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

పామాయిల్ ఫ్యాక్టరీలో పరిశీలన



పనులపై ఆరాతీస్తున్న ఆయిల్‌ఫెడ్ అధికారులు

దమ్మపేట: మండలంలోని అప్పారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీని హైదరాబాద్ ఆయిల్‌ఫెడ్ జనరల్ మేనేజర్ సుధాకర్‌రెడ్డి, ప్రాజెక్ట్స్ మేనేజర్ శ్రీకాంత్ రెడ్డి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఫ్యాక్టరీలో జరుగుతున్న విస్తరణ పనులను పరిశీలించి పురోగతిపై మేనేజర్‌తో సమీక్షించారు. పనుల్లో వేగం పెంచి త్వరగా పూర్తిచేయించి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో మేనేజర్ కల్యాణ్, సిబ్బంది రాజేశ్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.